


జనవరి, ఫిబ్రవరి, మార్చి 3 నెలల వ్యవధిలోనే జిల్లాలో 1058 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో నమోదు కాగా... మోసపోయిన వారంతా చదువుకున్న వారే కావడం గమనార్హం..

# సైబర్ అలర్ట్

**మూడు నెలల్లో 1058 ఫిర్యాదులు ● రూ. 9 కోట్లు పోగొట్టుకున్న బాధితులు ● తక్షణ ఫిర్యాదుతోనే రికవరీ సాధ్యం**


పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోవడంతో ప్రజలు లక్షల్లో నష్టపోతున్నారు. ఇటీవలే ఒకే రోజు రెండు ,మూడు కేసులు నమోదవుతుండటంతో ఆందోళన కలిగిస్తుంది. సైబర్ క్రైమ్ జరిగిన గంటల్లోనే ( గోల్డెన్ అవర్) బాధితులు ముందుగా 1930కు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం వారి పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, వారి బ్యాంక్ అకౌంట్‌లను ఫ్రీజ్ చేసి డబ్బులు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ డీజీపీ షిఖా గోయల్ సూచనల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**ఇలా మోసపోతున్నవారే ఎక్కువ..**

- పార్ట్ టైం జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ, నగదు ఇన్వెస్ట్ చేయిస్తూ, అధిక డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపిన ఘటనలో ఇటీవలే మోసపోయిన వారే అధికం.
- కొందరు సైబర్ నేరగాళ్లు ఏటీఎం కార్డు, డెబిట్ కార్డ్ అప్డేట్ చేయాలని వివరాలను సేకరించి వారి బ్యాంక్ ఖాతా నుండి డబ్బులను మాయం చేస్తున్నారు.
- ఫేస్ బుక్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకట నలకు క్లిక్ చేసి సైబర్ వలలో పడుతున్నారు.
- ఇటీవలే బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది, లండన్ నుండి హైదరాబాద్ వస్తున్నాను అని నమ్మించి, డబ్బు అవసరం ఉందని వచ్చాక ఇస్తానని చెప్పి నమ్మించి పలు దఫాలుగా ఉద్యోగినుండి రూ.8 లక్షలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది.
- సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా నేరాలు మాత్రం ఆగడం లేదు.

**ఇటీవలే జరిగిన సంఘటనలు**

- అమీన్‌పూర్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత ఏడాది డిసెంబర్ 28వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 తేదీన అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. స్నేహితుల వద్ద తెలిసిన వారి వద్ద నగదును అప్పుగా తీసుకొని 16 దఫాలుగా రూ.72 లక్షల 90 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలను ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి గత ఏడాది డిసెంబర్ 23వ తేదీన ట్రేడింగ్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగిని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. మొత్తం రూ.8 లక్షల 87 వేలు ఇన్వెస్ట్ చేశారు. తాను పెట్టిన నగదు, యాప్‌లో చూపిస్తున్న లాభాలను అడగటంలో స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.




ముత్తంగి రింగ్‌రోడ్డు వద్ద ఎల్‌ఈడీ ద్వారా సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పోలీసులు సూచిస్తున్న జాగ్రత్తలు..**

- అపరిచిత వ్యక్తి వాట్సప్, ఫోన్‌కాల్‌కు స్పందించకుండా ఉంటేనే మంచిది.
- తక్కువ ధరకే వస్తువులు ఇస్తామంటూ ఆన్‌లైన్‌లో పెడితే దాన్ని చూసి పరిశీలించిన తర్వాతేనే నగదు ఇవ్వాలి.
- సోషల్ నెట్వర్క్ సైట్లలో మహిళలు వ్యక్తి గత ఫొటోలు ఎవరితోను పంచుకోకపోవడమే మంచిది.
- ఉచిత వైఫై ఓపెన్ నెట్‌వర్క్ ద్వారా సోషల్ మీడియా ఫ్లాట్‌ఫారాలకు లాగిన్ కావొద్దు. వీటి ద్వారా సైబర్ నేరగాళ్లు అకౌంట్ పాస్‌వర్డ్ దొంగతనం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- చాలా వరకు సామాజిక మాధ్యమాల్లో మహిళలు తమ ఫొటోలను పెడతారు. వాటిని తస్కరించి, మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉంది. అమ్మాయిలు తమ ఫొటోలు కాకుండా ఇతర చిత్రాలు డీపీగా పెట్టుకుంటే మంచిది.

**అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు..**



సాఫ్ట్‌వేర్, ప్రైవేటు ఉద్యోగులు, చదువుకున్నవారే ఎక్కువగా సైబర్ వలలో పడి మోసపోతున్నారు. అపరిచిత వ్యక్తి నుండి వచ్చే లింకులు, ఫోన్ కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దు. టాస్కులు, కమిషన్‌ల పేరుతో వచ్చే, ఆన్‌లైన్ జాబ్‌లను నమ్మొద్దు. సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. ఫ్రీజ్ చేసిన నగదును కోర్టు ద్వారా బాధితులకు అందజేస్తున్నాం.రింగ్ రోడ్డు వద్ద ఎల్‌ఈడీ తెర ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జిల్లా సైబర్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

## జిల్లా బీజేపీ కన్వీనర్, కో-కన్వీనర్ల నియామకం



నియమితులైన వారిని సన్మానిస్తున్న విజిత్ వర్మ

కూకట్‌పల్లి: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి శుక్రవారం మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్‌గా డా. ఎస్. మల్లారెడ్డి, కో కన్వీనర్లుగా యాంజాల పద్మయ్య, వి. ప్రసన్ననాయుడు, అడ్వకేట్‌లను నియమించారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు వీరిని అభినందించారు.

## పీఎంజే జ్యువెలరీ ఎగ్జిబిషన్ షురూ..



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్ రాజునగర్ కాలనీలో శుక్రవారం పీఎంజే జ్యువెలరీలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ వేడుకలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్దభాస్కర్, రవి, జగదీష్ పాల్గొన్నారు.

## ప్రజల్లోకి వెళ్లనున్న కాంగ్రెస్ ఎన్నికల రథాలు



ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో జోరు పెంచుతోంది. ఇప్పటికే కరపత్రాలు పంపిణీ, ప్రజా సమూహాలను కలవడం చేసింది. ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ ప్రచార రథాలను సిద్ధం చేస్తోంది. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ప్రచారం కోసం ఆరు ప్రచార రథాలను ఏర్పాటు చేసింది. వీటిని శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ బాలానగ్‌లోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గాలి బాలాజీ, సాధుప్రతాప్‌రెడ్డి, మేకల మైకేల్, సంజీవరావు, గంధం రాజు, మోహన్‌రెడ్డి, చున్నూ పాషా, శివచౌదరి, లక్ష్మయ్య, టోచర్, అనిల్, మహేందర్, అస్లాం, మాధురి రాము, ప్రసన్న కుమార్, రజిత, బోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన శస్త్రచికిత్స చేసిన అమోర్ వైద్యులు




శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న పేషెంట్‌తో ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిశోర్ బి రెడ్డి, వైద్యులు

కూకట్‌పల్లి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడికి అమోర్ ఆస్పత్రి వైద్యులు 9గంటల పాటు శస్త్రచికిత్స చేసి సమస్యను తొలగించారు. పురుషుల అందరికీ ఎదభాగం సమతలంగా ఉంటుంది. కానీ 15 ఏళ్ల యువకుడుకి ఎదభాగం కుడి వైపు లోతుకు నొక్కుకు పోయినట్లు ఉంది. దీంతో అటువైపు ఉండే ఊపిరితిత్తులు కూడా లోపలకు నొక్కుకు పోయి, అతడికి ఊపిరి సరిగా ఆడక ఇబ్బంది పడేవాడు. పలు ఆస్పత్రులకు తిరిగినా సంక్లిష్టత కారణంగా ఎవరూ ఈ కేసు తీసుకోవడానికి ఇష్టపడలేదు. చివరకు నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఒకటైన అమోర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అండ్ అమోర్ కేన్సర్ సెంటర్‌కు ఆ యువకుడిని తీసుకొచ్చారు. నిశితంగా పరీక్షించి శస్త్ర చికిత్స చేసిన ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిశోర్ బీ.రెడ్డి వివరాలు వెల్లడించారు.

- ఈ శస్త్రచికిత్సలో ప్రధానంగా కార్డియోథోరాసిక్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ కె.అరుణ్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అభినందన్, ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్ జే. శ్రీనివాస్, ఎమర్జెన్సీ వైద్య నిపుణుడు డాక్టర్ జయశేఖర్, అనెస్థలిస్టులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మహేష్, రిహాబిలిటేషన్ బృందం ఎంతో కష్టపడి శస్త్రచికిత్సలో పాలు పంచుకున్నారు. అదే విధంగా ప్రత్యేకమైన ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, ఐసీయూ సిబ్బంది, నర్సులు సైతం అతడు కోలుకోవడానికి సహాయ పడ్డారు. వీరందరి సమష్టి నైపుణ్యం, నిబద్ధత వల్లే శస్త్ర చికిత్స పూర్తిగా విజయవంతం అయ్యిందని పేర్కొన్నారు. రోగి వేగంగా కోలుకుంటున్నాడని పేర్కొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా!



అక్షర ఇంటర్ నేషనల్ విద్యా సంస్థలో సమ్మర్ నైట్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్ నేషనల్ విద్యా సంస్థలో సమ్మర్ నైట్ క్యాంప్ శుక్రవారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. ఈ నైట్ క్యాంప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, అవగాహన ఏర్పడుతుంది అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సంవత్సరమంతా పరీక్షలు, క్లాసుల మధ్య గడిపిన విద్యార్థులకు ఈ సమ్మర్‌నైట్ క్యాంప్ ఎంతో ఉపశమనం ఇచ్చిందని తెలిపారు. ఈ నైట్‌క్యాంప్‌లో పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో గడపటం ద్వారా వారి మధ్య స్నేహ బంధం ఏర్పడింది. ఈ క్యాంపులో విద్యార్థినీ, విద్యార్థులు సంగీత, సాహిత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్యాంప్‌ఫైర్, ఆట పాటల మధ్య నైట్ క్యాంప్ ఆహ్లాదభరితంగా జరిగింది. విద్యాసంస్థల సీఈఓ మదన్‌మోహన్‌రావు, ప్రిన్సిపాల్ హైమావతి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### నేడు, రేపు పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో నార్సింగి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత కొనసాగుతుంది. ఈ సంతలో వివిధ జిల్లాల నుంచి ప్రజలు వచ్చి పశువుల కొనుగోలు, అమ్మకాలు కొనసాగిస్తుంటారు.

### శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి జేపీకే కృష్ణ తెలిపారు.

### శిల్పారామంలో నేడు బెంగాలీ కొత్త సంవత్సర వేడుకలు

మాదాపూర్: శిల్పారామంలో శనివారం బెంగాలీ నూతన సంవత్సరమైన పొయిలా బోయిషాక్ వేడుకను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తరాన్‌బంగియా సమితి, శిల్పారామం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బెంగాలీ సాంప్రదాయ నృత్యం, సంగీతం, బెంగాలీ చేనేత హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. బెంగాలీ వంటలు, స్ట్రీట్‌ఫుడ్‌లను సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### యువత కోసం.. సాల్వ్ ఫర్ టుమారో..

సాక్షి,సిటీబ్యూరో: సామాజిక ప్రయోజనం కలిగిన ఆవిష్కరణలు, పర్యావరణహిత పరిష్కారాల పట్ల నగర యువతలో ఆసక్తిని ప్రోత్సహిస్తూ ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్ శామ్‌సంగ్ ఆధ్వర్యంలో ఐఐటీ ఢిల్లీ, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ, యునైటెడ్ నేషన్స్ ఇండియాల భాగస్వామ్యంతో సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమం ప్రారంభమైంది. దీనిలో భాగంగా 14–17ఏళ్ల మధ్య వయస్కులైన పాఠశాల విద్యార్థుల కోసం స్కూల్ ట్రాక్ విభాగం కింద సమాజం–ఆవిష్కరణ థీమ్‌ను, అదే విధంగా 18–22 మధ్య వయస్కుల కోసం యూత్ ట్రాక్ పేరిట పర్యావరణం–సస్టెయినబులిటీ థీమ్‌లను ఎంచుకుని దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. స్కూల్ ట్రాక్ విభాగంలో గెలుపొందిన బృందం రూ.25లక్షల గ్రాంట్‌ను, యూత్ ట్రాక్ విభాగంలో గెలుపొందిన బృందం రూ.50లక్షల గ్రాంట్‌ను అందుకుంటాయన్నారు. మే 31వ తేదీ వరకూ www.samsung.com/in/solvefortomorrow ద్వారా దరఖాస్తులు పంపవచ్చునని తెలియజేశారు.

## 'శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ తిరుగులేని మెజార్టీ సాధిస్తుంది'



మహిళా నాయకులకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నేతలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లోకి చేరారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్‌రెడ్డి, సోషల్ మీడియా చైర్మన్ మన్నే సతీష్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీ సాధిస్తుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సిటీకి ఆనుకొని ఉన్న శేరిలింగంపల్లి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీగా గెలిస్తే మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. అందుకు కార్యకర్తలు సిపాయిల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాస్, పట్వార్ శశిధర్, నవీన్‌రెడ్డి, మాజర్, రూబీన్, శ్రీదేవి, లోకేష్ ఆధ్వర్యంలో శామల, కె.దేవి, లలిత కుమారి, అన్నపూర్ణ, రోజా రాణి, మాలతి, పూర్ణిమ, రూప, లావణ్య, దివ్య, అన్నపూర్ణ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## పోలీసు నియామక పత్రాలు అందజేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పోలీసు ఉద్యోగాలకు ఎంపికై ఎంక్వైరీలో కేసులు ఉన్నాయని తేలడంతో 250 మంది అభ్యర్థులు నియామకాలు నిలిచిపోయాయని పలువురు అభ్యర్థులు శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. గ్రామాల్లో చిన్నా చితక గొడవలకు, ఇతర కేసులలో నిర్దోషులుగా కోర్టులు తీర్పు ఇచ్చినా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటినుంచి కూడ వివిధ శాఖల మంత్రులతో పాటు టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్‌ను సైతం కలసి సమస్యను చెప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామకాలను నిలిచిపోయయి అని వెంటనే నియామకపు ఉత్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.

## గురుద్వారలో వైశాఖీ ఉత్సవాలు ప్రారంభం



కార్యక్రమానికి హాజరైన మహిళలు

అమీర్‌పేట: అమీర్‌పేట గురుద్వారలో వైశాఖీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలి రోజైన శుక్రవారం అమృత్ సంచార్ కార్యక్రమం నిర్వహించారు. సిక్కు మత గురువులు (రాగి జత్తాస్) గుర్బానీ కీర్తనలను ఆలపిస్తూ, గురు గ్రంధాన్ని పఠిస్తూ అమృత్ పాన్ (పవిత్ర పానియం)ను తయారు చేసి అందజేశారు. పలువురు యువతీ, యువకులు,మహిళలు,పిల్లలు హోలీ బాప్టిజాన్ని స్వీకరించారు. ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు కుశ్వంత్‌సింగ్, లాహోర్‌సింగ్,అజిత్‌సింగ్ పాల్గొన్నారు.

## 'కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉంది'

- ఒకరిద్దరు పార్టీని వీడితే నష్టమేమి లేదు
- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు ఇర్ఫాన్, మేకల హరినాథ్, బాల్‌రాజు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని. పార్టీ సానుభూతి పరులు ఒకరిద్దరూ పార్టీ మారినంత మాత్రన నష్టమేమి లేదని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శి ఇర్ఫాన్, మేకల హరినాథ్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బాల్‌రాజు తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల అంజయ్యనగర్ నుంచి కొంత మంది బీఆర్‌ఎస్ సానుభూతి పరులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిన విషయం తెలిసిందేనని వారు పార్టీని వీడటంతో బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం లేదన్నారు. కొందరి మీద ఉన్న పోలీసు కేసులను తొలగించుకునేందుకు పార్టీని వీడిన వ్యక్తులు బీఆర్‌ఎస్ పార్టీ పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు వాసుయాదవ్, మక్కాల సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మట్టి శ్రీను, రాజుగౌడ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు బ్లూ మార్చ్

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం (14న) నీలి చొక్కాలను ధరించి బ్లూ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామగళ్ళ సురేందర్ బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరవెల్లి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బ్లూ మార్చ్ విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు.సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

## స్కిల్ యూనివర్సిటీలో తక్షణ ఉపాధి

ఉస్మానియా యూనివర్సిటీ: స్కిల్ యూనివర్సిటీల స్థాపనతో విద్యార్థులకు తక్షణం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అక్వాఫిన ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్, ఓయూ పూర్వవిద్యార్థి డాక్టర్ ఎన్‌సీ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీబీఏ విద్యార్థులు ఫీల్డు విజిట్‌లో భాగంగా ఘట్‌కేశ్వర్ మండలం, కొర్రెముల గ్రామంలోని అక్వాఫిన ఇండస్ట్రీని సందర్శించారు. విద్యార్థులకు ఇండస్ట్రీ స్థాపన, నిర్వహణ, పెట్టుబడి, వస్తువు ఉత్పత్తి తయారీ, డిమాండ్, సప్లయ్, కార్మికుల పని తీరు తదితర అంశాలను వివరించారు. విద్యార్థులతో పాటు కాలేజీ బీబీఏ హెడ్ డాక్టర్ అంబాటి రమణ, అధ్యాపకులు శైలజ, కంప్యూటర్ సైన్స్ హెడ్ డా.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యూజీసీ సభ్యుడిగా సచ్చిదానంద మహంతి



రాయదుర్గం: యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) సభ్యుడిగా మూడేళ్ళ కాలపరిమితితో హెచ్‌సీయూ మాజీ ప్రొఫెసర్ సచ్చిదానంద మహంతికి అవకాశం కల్పించారు. మాజీ ప్రొఫెసర్, హెచ్‌సీయూలోని ఇంగ్లిష్ విభాగం అధిపతిగా ఆయన పనిచేశారు. భారత ప్రభుత్వం ఉన్నత విద్య మంత్రిత్వశాఖ నియమించింది. ఆయన జాతీయ, అంతర్జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ యూనివర్సిటీ చండీఘడ్‌లో అరబిందో చైర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

## నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

**హాజరుకానున్న మాజీ మంత్రి హరీష్‌రావు**

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నేడు పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 4 గంటలకు పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకసభ ఎన్నికలలో వెంకట్రామిరెడ్డి విజయానికి అనుసరించాల్సిన విధి విధానాలు, ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సుదే కీలకపాత్ర

**ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు**

రాయదుర్గం: ఇంజనీరింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, నేటి వ్యవస్థలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాముఖ్యత చాలా పెరిగిందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలో ఎస్కీ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ సహకారంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్స్ ప్రాముఖ్యతపై ఒక రోజు నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు.ఈ సందర్భం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విస్తారమైన డేటాను విశ్లేషించడానికి, అల్గారిథమ్‌లను ఉపయోగించడం ద్వారా ఆధునిక యుగంలో ఔత్సాహిక ఇంజనీర్లకు కీలకమైన నైపుణ్యతతో కూడిన ఏఐ, ఎంఎల్ సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడంలో శక్తివంతమైన పాత్రను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పోషిస్తుందన్నారు. ఫ్యూచర్లీ ఇంక్, ఫైట్ క్లబ్ సహ వ్యవస్థాపకుడు ప్రమోద్, వాల్‌మార్ట్ ల్యాబ్స్, ఫైట్ క్లబ్ నుంచి స్టాఫ్ డేలా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ నితిన్ కిషోర్, ఏఐ యొక్క విస్తృతమైన అప్లికేషన్‌లపై తమ అనుభవాలను పంచుకున్నారు. జోగినిపల్లి భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి ఏఐ, ఎంఎల్ అసోసియేట్ ప్రొఫెసర్ జే శాంతి, దుర్గాభవాని, ఎస్కీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పి సాయికిషోర్ ప్రసంగించారు.